కథాప్రపంచం

# ఉంగరం

ఈజిప్షియన్ కథ : యూసఫ్ ఇద్రిస్

**ఒకప్పుడు నవ్వులు, కేరింతలు ధ్వనించిన ఆ ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం నెలకొంది. సన్నగా, పొడుగ్గా, కాంతి తగ్గిన చర్మంతో నిస్సత్తువగా ఉన్న ముప్పై అయిదేళ్ల వితంతువు ఓ గదినుండి మరో గదికి తిరుగుతోంది. ఆమెకు పెళ్లి కెదిగిన ముగ్గురు ఆడపిల్లలున్నారు. వారంతా శోక సముద్రంలో ఈదులాడుతున్న చేపల్లా ఉన్నారు. అందరికన్నా చిన్నపిల్లకు పదహారేళ్లు. పెద్దమ్మాయికి ఇరవై. ఎవరూ అందగత్తెలు కారు. తండ్రిలాగే అందరివీ ఎగుడు దిగుడు శరీరాలు. బిగువులేని కండరాలు, గాలి తగ్గిన బూరల్లాగా వేళ్లాడుతున్నారు. అదేమిటో, అందరూ ఎప్పుడూ ఒకే గదిలో ఒకేచోట కలసి ఉంటున్నారు. రాత్రి సమయంలో, యిల్లంతా చీకటి ముసురుకున్నప్పుడు, పాత బట్టల మూటల్లా, అందరూ తలో దిక్కు కాళ్లు ముడుచుకుని పడుకుంటున్నారు. కాని, చెమట వాసన వేసే ఆ దుస్తుల్లో, కోరికలు తీరని శరీరం కొలిమితిత్తిలా ఎగిసి పడుతూనే ఉంది. పడుకున్నారన్న మాటేగాని, నిజానికి ఒక్కరికైనా నిద్రపడితే ఒట్టు!**

తండ్రి మరణించి రెండేళ్లు దాటింది. ఆయన బతికున్నంత కాలం అనేక నెలలు ఇంట్లోని నలుగురు ఆడవాళ్లు ఆయనకు సేవ చేశారు. శోక దినాలు పాటించారు. కాని, యింకా పాత అలవాట్లు వారిని వదలలేదు. మంచంపట్టిన మనిషైనా, యింట్లో ఓ మగాడికి సేవ చేస్తే అదో తృప్తి. అదో ధైర్యం. అప్పుడే మగవాడూ గడప దాటి లోపలికి ప్రవేశించడు గద. పెదవి విప్పకుండా నిశ్శబ్దంగా మాట్లాడుకునే వారు స్త్రీలు.

తండ్రి పోయాక ఆ ఇంట్లో నిశ్శబ్దం రాజ్యమేలుతున్న మాట నిజమే గాని, దానికి మరోపేరు నిరీక్షణ అని కూడా చెప్పవచ్చు.

వయసు గడచి పోతోంది. ఎవరొస్తారు తమ కోసం? ఇంట్లో ముగ్గురు పడుచు పిల్లలున్నారన్న విషయం నగరంలో ఏ యువకుడికీ తెలియదా? అవును మరి. తండ్రిలేని, కట్నమిచ్చుకోలేని ఆడపిల్లలను ఏ మగవాళ్లూ పట్టించుకోరు.

కానీ ఈ లోకంలో, ఎవరెంత పేదవారైనా, అంతకన్నా పేదవాళ్లు మరొకరుంటారు. ఎవరెంత కురూపులైనా, అంతకన్నా కురూపులూ వుంటారు. కాస్త ఓపిక పడితే చాలు, అందరి కోరికలూ తీరుతాయి.

ఆ నలుగురి జీవితాలనూ నిశ్శబ్దం ముసుగులా కప్పుకున్న సమయంలో, వారికి పల్లె పదాలు పాడుతూ ఓ గొంతు వినవస్తుంది.

ఆ గొంతు ఓ అంధుడిది. అతని పాటలు ఆత్మ లోకంలోని చీకటిని పారదోలటానికి సాయం చేస్తాయి. సమయం ప్రకారం అతను ప్రతి రోజూ వారి ఇంటి ముందు కొస్తాడు. కాసేపు పాటలు పాడి ముందుకు కదిలిపోతాడు. అయితే అతనెప్పుడూ వారి ఇంటి లోపలికి రాలేదు.

ఇటీవల ఓ మధ్యాహ్నం అంధుడు వచ్చినప్పుడు, చేతికర్రతో పాటు అతడిని రెండు జతల చేతులు ఇంట్లోకి తీసుకెళ్లాయి. ఆ అంధుడు ముందరి వరండాలో చాపమీద బాసింపట్టు వేసుకుని పాటలు పాడడం ప్రారంభించాడు. ఆ తర్వాత అందరినీ పలకరించాడు. అది మొదలు, ఆ యింట్లోని ఆడవాళ్లకు, అతడికీ యిదో అలవాటుగా మారింది.

ఆ ఇంట్లో వారంలో ఏదో ఒకరోజు, కొద్ది నిముషాలు మాత్రమే మగవాని గొంతు వినిపిస్తుంది. తరువాత మళ్లీ నిశ్శబ్దం. ఆ ఇంట్లోని స్త్రీలకు ఆశ చావదు. చిన్నదో, పెద్దదో ఆశలేని మనుషులుండరు. చిన్న ఆశలనేకం కలిస్తేనే ఒక పెద్ద ఆశగా మారుతుంది. ఆ ఆశే నిన్నూ, నన్నూ బతికిస్తోంది.

ఆ రోజు ఆ ఇంట్లోని స్త్రీలు ప్రాణాలు బిగబట్టి అతడి కోసం ఎదురు చూస్తున్నారు. మధ్యాహ్నమయింది. అతడి గొంతు వినిపించలేదు. ఆ యింటి తలుపులు తట్టే ఒకే ఒక మగవాడతను.

'తాము కురూపులమని అతడికి కూడా తెలిసిపోయిందా? అంధుడయినా మనిషి శుభ్రంగా వుంటాడు. మంచి దుస్తులు వేసుకుంటాడు. అతని పాదరక్షలెప్పుడూ మెరుస్తుంటాయి. ముఖ్యంగా అతని గొంతులో ఒక అధికారం ధ్వనిస్తుంది. అతనెందుకు రాలేదు? మళ్లీ ఆహ్వానించడం ఎలా? ఇప్పుడు, ఈ క్షణాన ఏ యింటిని పావనం చేస్తున్నాడో?' యిలా సాగుతున్నాయి ఆ ఇంట్లోని స్త్రీల ఆలోచనలు.

అతని పాటలు తాము రోజూ వినాలంటే ఒకే పద్ధతుంది. తమలో ఎవరో ఒకరు అతణ్ణి పెళ్లి చేసుకోవాలి!

అతడు బ్రహ్మచారి అని తెలిసింది. లేతగడ్డం, నూనూగు మీసాలతో ముద్దొస్తున్నాడు. అతనికీ ఓ అవసరం ఉండకపోతుందా! ముగ్గుర్లో అదృష్టవంతులెవరా అని కూతుళ్ల కళ్లలోకి చూసింది తల్లి.

కాని కూతుళ్లందరూ నిరసనగా చూశారు. 'మేం ఆకలిగొన్న పిల్లి కూనలమే కావచ్చుగాక, కాని అంధునితో ఆకలి తీర్చుకోవాలా?' అన్నాయి నిప్పు కణికల్లాంటి ఆ కళ్లు. లోకంలో నవయువకులే లేరా అని ప్రశ్నించాయి?

కాని పాపం, ఆ తల్లిచాటు పిల్లలకేం తెలుసు, ఈ లోకంలో పురుషుల గొంతెమ్మ కోరికలకంతం లేదని. అంధత్వం ఓ మగాడికి అనర్హత కాదని కూడా వాళ్లు గ్రహించలేదు.

''అమ్మా. నువ్వతణ్ణి పెళ్ళి చేసుకోగూడదూ?''

''నోర్మూసుకోండి. ఏమైనా బుద్ధుండే మాట్లా

డుతున్నారా? జనం ఏమనుకుంటారు. ఎంత అప్రదిష్ట''

''ఎవరేమనుకుంటే మనకేం. ఓ మగాడు ఇంట్లో ఉంటే అంతే చాలు. కనీసం, ఆ గొంతు రోజూ అందరం వింటాం గద''

''మీ పెళ్లిళ్లు కాకుండానే, నేను మరో పెళ్లి చేసుకోవాలా? కుదరదు''

''నీ పెళ్లివల్ల మాక్కూడా లాభం కలుగుతుందమ్మా. ఓ మగాడంటూ యింట్లో ఉంటే, మమ్మల్ని చూడటానికి మరెవరైనా వస్తారు. అతణ్ణి చేసుకోమ్మా.. మా కోసం.. మా మంచి అమ్మ గదూ''

పిల్లల తల్లి అతడిని పెళ్లి చేసుకుంది. ఆ చీకటి గదుల్లో స్త్రీల శ్వాసతో ఒక పురుష శ్వాస కలిసింది. అతడు అంధుడైనా బాగానే సంపాదిస్తాడు. అందువల్ల ఆదాయం కూడా పెరిగింది. అయితే మరో కొత్త సమస్య మొదటి రోజు రాత్రే పెరిగి, పెద్దదై ఆ యింటిని అతలాకుతలం చేసింది. అది ఊహించలేని రహస్యమేమీ కాదు.

అతడితో పెళ్లయ్యాక తొలి రాత్రి ఎలా గడిచిందో! గంటలు, నిమిషాలు, క్షణాలు ఎవరెవరు ఎలా లెక్కపెట్టారో. కూతుళ్లు పడుకున్నారో, పడక నటించారో గాని, వాళ్ల చూపులు తన పడక గదిలోకి అగ్ని తూణీరాల్లా దూసుకు వచ్చాయని తల్లి గ్రహించక పోలేదు. అవి కళ్లు కాదు. కోరికల కొలిమిలో ఎర్రగా కాలిన లోహగుళికలు. నీరవ నిశ్శబ్దంలో సైతం ఊహల్ని పసిగట్టే రాడార్లు. ఆంటెన్నాలు. కూతుళ్లే. కాని చిన్న పిల్లలు కాదు. అనుభవాల కోసం పరితపిస్తున్న కోరికలు. తలుపులు మూసిన ఆ చీకటి గది వాళ్ల ఊహలకు పురిటి గది. ఇదీ తొలి రాత్రి వాతావరణం.

కానీ మరునాటి ఉదయం పరిస్థితి మారిపోయింది. అందరూ నవ్వుతూ, వాలు చూపులతో, పరిహాసాలాడుకుంటూ ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యారు. రెక్కల సాయంతో భువికి దిగి వచ్చిన అప్సరసల్లా తల్లి చుట్టూ చేరి గుసగుసలాడారు. తల్లి సిగ్గుమొగ్గై ముడుచుకుపోయింది. వాళ్ల గుసగుసలకు అతడు విరగబడి నవ్వాడు.

తలంటు పోసుకున్న తల్లి దువ్వెనతో తడి



జుత్తునే వెనక్కు దువ్వుకుంది. అనేక సంవత్సరాలుగా కనిపించని వెలుగు ఆమె కళ్లలో మెరిసింది. ఇన్నాళ్లూ నూనె లేక ఆరిపోయిన ప్రమిదను అతడు వెలిగించాడు. చీకటిలో, యిన్నాళ్లూ దుమ్ము, సాలెగూళ్లు పట్టిన ఇల్లు యిప్పుడు శుభ్రంగా కనిపించింది. వాడిన మొహం ఇప్పుడు విద్యుత్కాంతితో మెరుస్తోంది. ఇప్పుడామె కన్నీరు కార్చడం లేదు. కాని స్వేద బిందువులు కనుకొలకుల్లో చేరి కళ్లు చురుక్కుమంటున్నాయి.

సుఖంగా వున్నప్పుడు ఆడవాళ్లు ఎన్ని రకాల నవ్వగలరో! నిశ్శబ్దం కాదు, ఆ యింటిలో ఇప్పుడు పగలబడి నవ్విన చప్పుడు వీధిలోకి కూడా వినిపిస్తోంది. ఇక భోజన సమయంలో అతడు వేసే జోకులకు అంతులేదు. అందరూ పొట్టలు చెక్కలయ్యేలా నవ్వుతున్నారు.' అతని గొంతు, పెళ్లి కాని పిల్లల్ని సమ్మోహితుల్ని చేస్తోంది.

'పెళ్లి చేసుకుని మంచి పని చేశావమ్మా. ఇప్పుడు మాలో కూడా ఆశలు చిగురిస్తున్నాయి' అనుకున్నారు పిల్లలు. యిక నవ వధువుల కోసం అన్వేషిస్తున్న యువకులు, త్వరలో తమ యింటి తలుపూ తడుతారని ఎదురు చూస్తున్నారు.

వరుల సంగతి సరే, తల్లి మనసును తొలిచేస్తున్నది కూతుళ్ల పెళ్లి విషయం కాదు. ఇంట్లో తన భర్త లేగ పిల్లల్ని నోట కరచుకు పోయే సివంగిలా తిరుగుతున్నాడు. అతడు అంధుడే కావచ్చు. మనమందరంకూడా ఎదుటి మనుషుల నైజం తెలుసుకోలేని అంధులమే గద. అతడిలో యవ్వనోధృతి గట్లు తెంచుకుని ప్రవహిస్తోంది. అతని స్పర్శతో యిన్నేళ్లు నిర్జీవంగా పడి వున్న ఆ మధ్య వయస్కురాలు కూడా, శోభనం తెల్లవారి పెళ్లి కూతురులాగ తుళ్లి పడుతోంది.

నిశ్శబ్దం అనేది ఆ ఇంట్లో ఇప్పుడు గతం. ఇప్పుడా ఇంట్లో ఎవ్వరి మొహంలో చూసినా నూతనోత్సాహం పొంగి పొర్లుతోంది.

అతడామెకు చట్టబద్ధమైన భర్త. దైవ సాక్షిగా. అందువల్ల, అతనితో రహస్యంగా గడపవలసిన అవసరం లేదు. సాయంత్రమవుతుంది. చీకట్లు ముసురుకుంటాయి. పగలంతా మాట విన్న శరీరం ధిక్కరిస్తుంది. పక్కగదిలో పిల్లలున్నారు. సెర్చిలైట్ల లాంటి వారి చూపులున్నాయి. తమ ఉచ్ఛ్వాస, నిశ్వాసలను కూడా వాళ్లు స్పష్టంగా వినగలరు. ఇక మూల్గుల సంగతి చెప్పనేల!

రోజంతా, అందరి ఇళ్లల్లో బట్టలుతుకుతుందామె. అతను పాటలు పాడుతూ తిరుగుతాడు. తొలి రోజుల్లో మధ్యాహ్నం పూట విశ్రాంతి కోసం యింటికి వచ్చేవాడే కాదు.

ఒకసారి, రాత్రి సుఖనిద్ర తర్వాత తెల్లారి ఎవరో రమ్మంటే పాటలు పాడేందుకు వెళ్లాడు. తిరిగి తిరిగి మధ్యాహ్నం యింటికి వచ్చాడు. ఆమె నిశ్శబ్దంగా ఉంది. అలా ఎందుకుందో అతనికి అంతుబట్టలేదు. గలగలా పొంగిపొరలే ఆ గొంతు ఎందుకు మూగబోయింది!? తను పెళ్లిలో బహుమతిగా, కట్నంగా యిచ్చిన వుంగరం వేలికెందుకు పెట్టుకోలేదు?

తన ఆకలి తీరిన తర్వాత ఆమెకు, పిల్లలు ఎంతాకలిగా వున్నారో గుర్తుకొచ్చింది.

'తను చేసింది నేరం. అంతకన్నా ఆత్మహత్య చేసుకుని మరణించినా మేలే. భోరున విలపించాలి. కాని కన్నీళ్లు యింకిపోయాయి. తన శరీరం, ముక్కు, కళ్లు, స్పర్శ - ఒకటేమిటి - యింద్రియాలన్నీ పాపం చేశాయి. పెళ్లికెదిగిన కూతుళ్లను పెట్టుకుని తను కులుకుతుందా? అంధుడు కూడా చూడగలడు. కామంతో కళ్లు మూసుకు పోయాయి తనకు. చూపు వల్ల గద తను పాపం చేసింది. కళ్లు పొడుచుకుంటే సమస్య పరిష్కారమవుతుందా? ముగ్గురు పిల్లల ఊపిరుల వేడిగాలులతో యిల్లు లోహకాసారమైంది. కలలకు ఆకారం లేదనుకుంటాం గాని, అవి చేసే అల్లరి చిల్లర పనులను ఆపటం ఎవరి తరం!'

ఆ ఇంట్లో శ్వాస అగ్నికీలగా మారుతోంది. శరీరం మీద  లావా విరజిమ్ముతోంది. చర్మం ఎడారిగా మారుతోంది. గొంతులో ఏదో అడ్డుపడి వూపిరి తీసుకోవటం కూడా కష్టంగా మారుతోంది. గాలిలో తేలివచ్చిన ఆకలి తరంగాలు అందర్నీ చుట్టుముట్టాయి. నిప్పుల్లో కరుగుతున్న మూడు శరీరాలలో తేడా లేదు. పెద్దా చిన్నా తారతమ్యం లేదు. అందర్నీ దహించి వేస్తున్నవి అవే మంటలు. అవే కేకలు. అవే మూల్గులు. కాదు. ఆర్తనాదాలు. వేడుకోళ్లు. అభ్యర్థనలు. తడారిన పెదాలు.

పిల్లల పట్ల తన చట్టబద్ధమైన ఒక బాధ్యతను విస్మరించి, చట్టబద్ధమైన తన అవసరాన్ని తీర్చుకుందామె

సహనానికి కూడా హద్దులుంటాయి. 'పిల్లల కోసం పెళ్లికొడుకులు రాకపోరు' అనే ఆశ ఎండమావిగానే మిగిలింది. నీటికోసం పరిగెత్తి అక్కడ



చెలమ లేదని తెలిసినప్పుడు దాహం తీవ్రతరమౌతుంది. భోజనం దొరకదని తెలిసిన క్షణాన, ఆకలితో మెలికలు తిరిగిపోతాం. ఆమెకు అవన్నీ తెలుసు. ముఖ్యంగా ఆకలి తీరిన తర్వాత, అన్నార్తుల మీద సానుభూతి పెరుగుతుంది.

తను తినగా మిగిలిన ఎంగిలి మెతుకులైనా వాళ్లకు పెట్టాలి. నిజానికి, మొదట వాళ్ల ఆకలి తీర్చి, చివరన తను తినటం తల్లిగా తన బాధ్యత. కాని, ఆకలి తీవ్రతలో బాధ్యతను విస్మరించింది.

ఆ రోజు మధ్యాహ్నం అతనెంత పలకరించినా, నోరు మెదపకుండా వుండటానికి కారణం అదే. ఒకసారి ఆమె మౌనం దాల్చిన తర్వాత యిక ఆమె గొంతునుంచి ఏ చిన్న శబ్దం కూడా వెలువడలేదు. ఉదయం టీ తాగుతున్నప్పుడు రెండో అమ్మాయి నిశ్శబ్దం పాటించింది. అదే రొటీన్‌గా మారింది. ఆ రోజంతా చిన్నమ్మాయీ, పెద్దమ్మాయీ గలగలా నవ్వటం విని అతడెంతో సంతోషించాడు.

ఓపిక నశిస్తోంది. ఒకరోజు పెద్ద పిల్లను చూసి తల్లి కడుపు తరుక్కుపోయింది. ''ఒక్కసారి నీ ఉంగరం యివ్వమ్మా'' అని ప్రాధేయపడిందా అమ్మాయి. కనీసం, ఒక్కరోజైనా ఆ ఉంగరం పెట్టుకుంటే ఎంత సుఖమో!

ఆ సాయంత్రం మౌనముద్ర పెద్దపిల్లది.

అంధుడు ఆనందాతిరేకంతో గొంతెత్తి పాటలు పాడాడు.

మరోరోజు చిన్న పిల్లకూడా అదే ఉంగరం తీసుకుంది.

దీపం పక్కనే పడి వుంటుంది ఉంగరం.

ఇంట్లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అంధుడు చెవులు రిక్కించి వింటున్నాడు. ఉంగరం పెట్టుకున్న వాళ్లు దీపం ఆర్పేసారు.

గదిలో చీకటి అలముకుంది. కాని, అలవాటైన కళ్లు చీకట్లో కూడా చూడగలవు. అంధుడి ఆనందానికి హద్దుల్లేవు. యిల్లెందుకింత నిశ్శబ్దంగా ఉందో అతనికి అర్థం కావటం లేదు. స్త్రీ శరీరం రోజుకో రకంగా ఎందుకు మారుతుందో అతనికి అంతుపట్టడం లేదు.

ఒకరోజు కలువ మొగ్గలా ఉంటుంది.

ఒక రోజు వడలిన పువ్వులా ఉంటుంది.

ఒక రోజు గులాబీ రేకుల్లా, ఒకరోజు బ్రహ్మజెముడులా.. ఒక రోజు స్వేద బిందువులు. ఒక పరి జలపాతాలు.

కాని, తను గుర్తు పట్టగలిగింది ఉంగరమొక్కటే. అది వున్నంత కాలం ఆమె తన భార్యే! ఇటీవలే ఆ విషయాన్ని గమనించాడు. ఎవరూ మాట్లాడకపోతే భార్యను పోల్చుకునేదెట్లా? ఉంగరం పట్టుకుని మాత్రమే అతను పోల్చుకోగలడు! అతడూ నిశ్శబ్దంగా ఉండటం అలవాటు చేసుకున్నాడు.

ఇది నిరాశా నిస్పృహల నిశ్శబ్దం కాదు. అది వాళ్ల మధ్య కుదిరిన ఒప్పందం. చట్టప్రకారం రాసుకున్నది కాకపోతేనేం! ఆ ఉంగరానికి మంత్రశక్తులున్నాయి. అతడు ఇంటికి రాగానే, అతడిని కోరుకున్న స్త్రీ ఆ ఉంగరం ధరిస్తుంది కాబోలు. సన్నగా, లావుగా, మృదువుగా, కరుకుగా, పొట్టిగా, పొడవుగా – హా – యివ్వన్నీ చూపున్న వాళ్లు గమనించవలసిన విషయాలు. తనకు తెలిసింది ఉంగరమొక్కటే.

*

స్వేచ్ఛానువాదం: మణి

కవిత

## ప్రవృత్తి



మనసును తేలిక చేసేందుకే
మమకారపు బరువుతో
దానిని నింపుతుంటాం

ఆకాశానికి వేసుకున్న నిచ్చెనపై అడుగులేస్తూ
అలవికానంత జ్ఞానాన్ని
వీపుకు కట్టుకుంటాం

కాలిపోబోతున్న యింటినుంచి
బయటపడే కంగారులోనూ
కనిపించిన ప్రతీదాన్నీ మూటకడతాం

అణువంత శ్రమపడకుండా
అనుభవించగల ఆనందంకోసం
అహరహమూ మనం కష్టపడతాం

తర్కంతో అసలేమాత్రమూ
పొసగని పనులు చేస్తూ
తార్కికులమని భ్రమపడతాం

కూడికలూ హెచ్చవేతలూ
మాత్రమే చేస్తూ
నిశ్శేషాన్ని సాధించాలని ఆశపడతాం

– టి. శ్రీవల్లీరాధిక

## అనుకోని 'అతిథి'....



సాధారణంగా ఇంటికి అతిథులు వస్తే కంగారు పడరు. సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించి సకల మర్యాదలు చేస్తారు. మనుషులు వస్తే ఈ మర్యాదా, మన్నన ఉంటాయి. అదే పాములు వస్తే ఏం చేస్తారు. అందరూ చేసే పనే ఆ ఇంట్లో వాళ్లూ చేసారు. అనుకోకుండా వచ్చిన కొండచిలువను చూసి మొదట కంగారు పడినా ఆ తరువాత దాన్ని అధికారులకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు...

కాలిఫోర్నియాలో రాత్రి సమయంలో ఓ కుటుంబంలోని అన్నా చెల్లెలు కంప్యూటర్ ముందు కూర్చొని సీరియస్‌గా పనిచేసుకుంటున్నారు. ఇంతలో వారి మధ్యకి ఓ కొండచిలువ ఎదురుగుండా ఉన్న మైదానం నుంచి పాక్కుంటూ వచ్చేసింది. అనుకోకుండా తమ మధ్యకు వచ్చిన ఆ కొండచిలువను చూసి ఆ అన్నాచెల్లెళ్లు మొదట బిత్తరపోయారు. ఆ తరువాత కొద్దిసేపటికి తేరుకొని కొండచిలువ తమ ఇంట్లోకి వచ్చిన విషయాన్ని యానిమల్ కంట్రోల్ అధికారికి ఫోను ద్వారా తెలియజేశారు. వారు వచ్చి సుమారు 11 అడుగుల పొడవు, 50 పౌండ్లు బరువు కలిగిన ఆ కొండ చిలువను పట్టుకొని ట్రక్‌లో వేసుకొని వెళ్లిపోయారు.

ఈ సందర్భంగా యానిమల్ కంట్రోల్ అధికారి వెల్ష్ మాట్లాడుతూ, కొండచిలువను కాలిఫోర్నియాకు చెంది ఓ వ్యక్తి పెంచుకుంటున్నాడని, యజమాని లేని సందర్భంలో అది తప్పించుకొని వచ్చి ఉండవచ్చని అన్నారు. దాన్ని తిరిగి దాని యజమాని దగ్గరకు పంపించనున్నట్లు ఆయన చెప్పారు.

❑